

నేడు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దోమకొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దోమకకొండ మండల కేంద్రంలోని ఆముదాలపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణమాసం శనివారం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన తదుపరి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

అన్నదాతకు.. అధిక ప్రాధాన్యం

- 23.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ
- గత పాలకుల పాపాలు శాపాలై వెంటాడుతున్నా రైతుల విషయంలో రాజీ పడలేదు
- ఇందిరమ్మ రైతుభరోసా కింద ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయం
- ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తున్నాం
- తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ కార్పొరేషన్ ఎం.కోదండరెడ్డి



మాట్లాడుతున్న ఎం.కోదండరెడ్డి



జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎం.కోదండరెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధి మైదానం మువ్వన్నెల జెండా రెపరెపలతో మురిసింది. సాయుధ దళాల కవాతు నడుమ.. భారత్ మాతాకు జై అనే నినాదాలతో హోరెత్తింది.. తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ కార్పొరేషన్ ఎం.కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, జిల్లా అభివృద్ధిని వివరిస్తూ ఆయన ప్రసంగం సాగింది. ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, ఉత్తమ ప్రతిభకనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహుతుల మదినిండా దేశభక్తి ఉప్పొంగింది. శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలు జిల్లాలో అన్ని చోట్ల ఘనంగా జరిగాయి. వాడవాడలా జాతీయ పతాకాలు ఎగురవేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చౌరస్తాలు త్రివర్ణ తేజంతో మెరిసిపోయాయి. పిల్లలు చేతుల్లో జెండాలు పట్టుకుని కేరింతలు కొట్టారు. త్రివర్ణ బ్యాడ్జీలతో ప్రతీ ఒక్కరిలో దేశంపై ప్రేమ ఉప్పొంగింది. అడుగడుగునా జాతీయ భావం ఉప్పొంగింది. మహనీయులు, వీరుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ గీతం మార్మోగింది. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాలు స్వేచ్ఛా సంబరాలు అంబరాన్నంటాయి.

కామారెడ్డి(ఆంధ్రజ్యోతి)/కామారెడ్డి టౌన్, ఆగస్టు 15: రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తు వారికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఆర్థిక తోడ్పాటును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ కార్పొరేషన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కామారెడ్డి ఇందిరాగాంధి స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేశారన్నారు. మహాత్ముడి సారథ్యంలో బ్రిటీష్ వారితో యుద్ధం గెలిచిన మనం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో దేశ అంతర్గత శత్రువులైన పేదరికం, అసమానతలు, అస్పృశ్యత, అంటరానితనంపై పోరాటానికి నాంది పలికామన్నారు.

రైతులకు అండగా..

వ్యవసాయానికి ఇందిరమ్మ రైతుభరోసా, రైతు రుణమాఫీ అందించడమే కాకుండా పండించిన ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టామని. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా గత పాలకుల పాపాలు శాపాలై వెంటాడుతున్నా రైతుల విషయంలో రాజీపడలేదని తెలంగాణ రైతును రుణవిముక్తి చేసి దేశంలో అత్యధిక పంట పండించే దిశగా ప్రోత్సహించామని తెలిపారు. ఇక జూన్ 16న ఇందిరమ్మ రైతుభరోసా కింద ఎకరాకు రూ.12వేల పెట్టుబడి అందించగా 9 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 లక్షల 11వేల 184 మంది రైతుల ఖాతాలో రూ.9వేల కోట్లు జమ చేయగా కామారెడ్డి జిల్లాలో 3లక్షల 3వేల 568 మంది రైతుల ఖాతాలో రూ.305 కోట్ల 98 లక్షలను జమ చేశామన్నారు. రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించుటకు రూ. 2కోట్ల 70లక్షల నిధులతో మండలానికి 3 చొప్పున 72 రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని కల్పించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో గత యాసంగిలో 3లక్షల 82వేల 555 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని 446 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రూ.887 కోట్ల 53లక్షల రూపాయలను 73 వేల 640 మంది రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు.

ఈ వానాకాలం సీజన్ కోసం 71 వేల 306 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను, 2 వేల 423 క్వింటాళ్ల జిలుగు విత్తనాలను, 1,495 క్వింటాళ్ల వరి ధాన్యం విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు.వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌లో భాగంగా 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తు రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నామన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

వ్యవసాయంతో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. 70 ఏళ్లుగా పీడీఎస్ వ్యవస్థ పేద ప్రజల ఆహార భద్రతకు భరోసా ఇస్తుందని తెలిపారు. అదేస్ఫూర్తితో ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందని తెలిపారు. 13 వేల కోట్ల రూపాయల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. ప్రజల ఆత్మగౌరవప్రతీక అయిన రేషన్‌కార్డులను జూలై 14 నుంచి ప్రారంభించామన్నారు. జిల్లాలో కొత్తగా 15 వేల 302 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా 48 వేల 971 మంది కుటుంబ సభ్యులను వారికి సంబంధించిన రేషన్‌కార్డులతో జత చేయడం రూ.500లకు గ్యాస్ సిలిండర్ సరఫరా పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1లక్ష 50 వేల 131మంది వినియోగదారులకు 5లక్షల 58 వేల 981 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. దీనికిగాను ప్రభుత్వం 16 కోట్ల 5లక్షల సబ్సిడీ అందించిందని తెలిపారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో బడిబాట కార్యక్రమం ద్వారా 18 వేల 977 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేర్చుకోడం జరిగిందన్నారు. 5 పాఠశాలల్లో 100 శాతం అడ్మిషన్‌లు కల్పించామని విద్యార్థులు లేక మూసివేయబడిన 5 పాఠశాలలను తిరిగి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర, అటవీ శాఖాధికారి నిఖిత, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్‌నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శకటం







విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

క్రీడలతో పాటు రాజకీయాల్లో రాణించాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

రామారెడ్డి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, రాజకీయ నాయకులు చదువుతో పాటు రాజకీయాల్లో రాణించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రామారెడ్డి మండల కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరును నిలుపుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామాల శీలాసాగర్, విండో వైస్ చైర్మెన్ అమ్ముల పశుపతి శర్మ, ఏఎంసీ డైరెక్టర్ ఎండి.రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: స్వాతంత్ర దినోత్సవాన్ని ఎల్లారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కార్యకర్తలతో కలిసి జెండా ఆవిష్కరించి స్వతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తు చేస్తూ నేటి తరాల బాధ్యతపై ప్రసంగించారు. ప్రతి ఒక్కరు దేశభక్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపాలిటీలో సేవలు అందిస్తున్న 63 మంది పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే సన్మానించి నూతన యూనిఫామ్‌లను అందజేశారు. నియోజకవర్గంలోని ఉత్తమ సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టును ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటితో నిండింది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండినందున ప్రస్తుత ఖరీఫ్ పంటలతో పాటు, రబీ పంటలు సాగు కానున్నాయని ఆయన తెలిపారు.

సహకార సంఘం పదవీకాలం పొడిగింపు

సదాశివనగర్: సహకార సంఘాల పదవీకాలం పొడిగించడం హర్షణీయమని సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, కమలాకర్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల పదవీకాలం ఆరు నెలల పాటు పొడిగించడంతో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును వారు మార్యదపూర్వకంగా కలిశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందుతున్న సేవలను దృష్టిలో ఉంచుకుని సహకార సంఘాలకు తప్పనిసరి అవసరమని అందుకోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే తెలిపినట్లు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి స్వీట్లు తినిపించారు. అనంతరం సదాశివనగర్ మండలకేంద్రంలో సహకర సంఘం ఆవరణంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవలకు గాను ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సన్మానించారు. తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ కార్పొరేషన్ ఎం.కోదండరెడ్డి శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య వేడుకల్లో ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రసంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ విక్టర్



నిఖిత డీఎఫ్‌వో



విజయలక్ష్మీ డీసీహెచ్ఎస్



చంద్రశేఖర్ డీఎంహెచ్‌వో



యేమియా భిక్కనూరు వైద్యాధికారి



ముజీబ్ తహసీల్దార్



విఠల్ కానిస్టేబుల్



శశికాంత్ కానిస్టేబుల్



సయ్యద్ సాజిద్ అలీ ఎంపీడీవో



రాజు ఏవో



విజయ మహాలక్ష్మీ వైద్యాధికారి



రాజు ఏఎస్సై

ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడిని పూజించేందుకు నీటిని తీసుకవస్తున్న మహిళలు

పెద్ద కొడప్‌గల్, ఆగష్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకుని మండలంలోని కాటేపల్లి తాండవాసులు పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లాలో గాంధారి మండలం తర్వాత పెద్ద కొడప్‌గల్ మండలంలో కాయిత లంబాడీలు అధికంగా జీవనం సాగిస్తుంటారు. వీరికి శ్రీకృష్ణుడు ఆది దేవుడు కావడంతో శ్రీకృష్ణుడి జన్మదినాన్ని వేడుకగా నిర్వహిస్తారు. పండుగ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలు ఆచరించి గ్రామ పొలిమేర నుండి నీటిని తీసుకవచ్చి కృష్ణుడిని పూజించి ఉపవాస దీక్షలను విరమిస్తారు. అంతేకాకుండ తాండ పరిధిలో ఉట్టి వేసి అంతా కలిసి ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రత్యేకంగా నెయ్యితో చేసిన పిండి వంటకాన్ని భగవంతునికి ప్రసాదంగా నివేదించి తమ బందు మిత్రులకు పంచుతారు. పండుగ సందర్భంగా తాండలో ఒక చోటు వంటలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలి



భిక్కనూరు కెనరా బ్యాంకులో విద్యార్థులకు స్కాలర్ షిప్ అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని భిక్కనూరు కెనరా బ్యాంకు మేనేజర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా విద్యా జ్యోతి పథకంలో భాగంగా భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ బాలిక విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కెనరా బ్యాంకు తరుపున కెనరా విద్యా జ్యోతి పథకంలో భాగంగా 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు టాపర్‌గా నిలిచే బాలికలకు ఈ స్కాలర్ షిప్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం టాపర్లుగా నిలిచిన 5 తరగతిలో పి.సహస్రిక, 6వ తరగతిలో కె. వైష్ణవీ, 7వ తరగతిలో సాహెచ్ హార్షితకు రూ.3వేల చొప్పున, 8వ తరగతిలో పి. దివ్యకృపా, 9వ తరగతిలో జి. సిరివెన్నెల, 10వ తరగతిలో ఎం.స్నేహాకు రూ.5వేల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. ప్రజలు కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ మేనేజర్‌గా రవికుమార్

జిల్లా ఉత్తమ బ్యాంకు మేనేజర్‌గా భిక్కనూరు కెనరా బ్యాంకు మేనేజర్ రవికుమార్ శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారులకు మున్ముందు మరింత మెరుగైనా సేవలను అందిస్తామని అన్నారు. అవార్డు అందుకున్న మేనేజర్‌కు బ్యాంకు సిబ్బంది, మండల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

చుక్కాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచారెడ్డి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తీరొక్కపూలతో అలంకరించి పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మహిళలు పెద్దఎత్తున కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నసురుల్లాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

ముువ్వన్నెల జెండా రెపరెపలు

ముువ్వన్నెల జెండా రెపరెపలతో మురిసింది. ఆర్మూర్, బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చౌరస్తాలు త్రివర్ణ తేజంతో మెరిసిపోయాయి. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహుతుల మదినిండా దేశభక్తి ఉప్పొంగింది. స్వాతంత్ర్య వేడుకలు అన్ని చోట్లా ఘనంగా జరిగాయి. వాడవాడలా జాతీయ పతాకాలు ఎగురవేశారు. పిల్లలు చేతుల్లో జెండాలు పట్టుకుని కేరింతలు కొట్టారు. త్రివర్ణ బ్యాడ్జీలతో ప్రతీ ఒక్కరిలో దేశంపై ప్రేమ ఉప్పొంగింది. అడుగడుగునా జాతీయ భావం ఉప్పొంగింది. జాతీయ గీతం మార్మోగింది.



బోధన్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గౌరవ వందనం చేస్తున్న దృశ్యం



కమ్మర్‌పల్లిలో జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



ఎడపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ దత్తాద్రి



జాకోరాలో...



నవీపేటలో...



బాల్కొండలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే



పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో...



జాతీయ జెండావిష్కరిస్తున్న ఎంపీడీవో



మోర్తాడ్ ప్రజానిలయంలో జెండానువిష్కరిస్తున్న ముత్యాల



ఆర్మూర్‌లో జెండా ఎగురవేస్తున్న సబ్‌కలెక్టర్



శ్రీచంద్ర టెక్నో స్కూల్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



సాలూరలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న దృశ్యం



101 అడుగుల జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న దృశ్యం



ఏర్గట్ల తహసీల్దార్ కార్యాలయంలో జెండావిష్కరణ



ముప్కాల్‌లో గాంధీ విగ్రహం ఎదుట జెండాను ఎగురవేస్తున్న వీడీసీ అధ్యక్షులు

క్రైం సమాచారం

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

భీమ్‌గల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి విక్రయిస్తు ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శుక్రవారం భీమ్‌గల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కేసీఆర్ కాలనీ వద్ద ఇద్దరు వ్యక్తులు ప్లాస్టిక్ కవర్లు పట్టుకొని పోలీసులను చూసి వాటిని అక్కడే వదిలి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. వారిని కేసీఆర్ కాలనీకి చెందిన అడికే వినీత్, రాయసాగర్‌గా గుర్తించామని, వారి వద్ద నుంచి ఏడు ప్యాకెట్లలో 30 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కేసులో చాకచక్యంగా విధులు నిర్వహించిన భీమ్‌గల్, మోర్తాడ్ ఎస్సైలు సందీప్, రాము, కానిస్టేబుల్స్ రాజశేఖర్ , గోపాల్, మల్లయ్యలను సీఐ అభినందించారు.

రాంపూర్ శివారులో ఇసుక డంప్‌ల సీజ్

కోటగిరి, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన 30 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను తహసీల్దార్ గంగాధర్ సీజ్‌చేశారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇసుక రవాణాకు అనుమతి పొందిన కొందరు అక్రమార్కులు ఇసుకను గుట్ట ప్రాంతంలో నిల్వ చేశారని స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శుక్రవారం ఇసుకడంప్‌లను సీజ్ చేశారు. ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తామన్నారు.

రాజంపేటలో విద్యార్థిపై వీధి కుక్కల దాడి

రాజంపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):పాఠశాలలో మలమూత్ర విసర్జనకు వెళ్లిన ఎల్‌కేజీ విద్యార్థిపై వీధి కుక్కల దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని శ్రీశారద శిశుమందిర్ పాఠశాల ఆవరణలో గురువారం మూత్రవిసర్జనకు బయటకు వెళ్లిన విద్యార్థి ధనుంజయ్‌పై వీధి కుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తెలిపారు. బాలుడిపై దాడిచేస్తున్న సమయంలో టీచర్ ఆపే ప్రయత్నం చేయడంతో టీచర్‌పైన దాడిచేసినట్లు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

బాన్సువాడ రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్‌లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తూ రోడ్డుపై నడిచే పాదచారులపై శుక్రవారం దాడిచేసి ఆరుగురిని గాయపరిచింది. గ్రామానికి చెందిన బాగయ్య, షకూర్, సాయవ్వ, సాయిలు, అనుషవ్వతో మరొకరిని గాయపర్చగా వారిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

ఎడపల్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాపల్లి గ్రామానికి చెందిన కేతావత్ కవిత(35) అనే మహిళ అదృశ్యమైనట్టు ఎడపల్లి ఎస్సై రమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వడ్డాపల్లి గ్రామానికి చెందిన కేతవత్ కవిత అనే మహిళ ఈ నెల 11వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిందని, ఆమె భర్త కేతావత్ సుక్‌లాల్ ఇంటికి రాగా ఇంట్లో తన భార్య లేకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం కవిత భర్త సుక్‌లాల్ ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

సుభాష్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్‌స్టేషన్ లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బొంగేవారు అనిల్(45) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు . 2013 బ్యాచ్ కు చెందిన ఆయన కొద్ది కాలం క్రితం క్యాన్సర్ బారిన పడ్డారు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

రెండు తండాల మధ్య వివాదం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకుంట తండా గ్రామస్తులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు భారీగా తరలివచ్చారు. ఎర్రకుంట తండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, గొడవలు చేసుకోవద్దని ఎస్సై భార్గవ్ తండా వాసులకు ఈ సందర్భంగా సూచించారు. గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవన నిర్మాణం విషయంలో బెజ్జం చెరువు తండాతో పాటు ఎర్రకుంట తండాల మధ్య వివాదం నెలకొంది. గ్రామపంచాయతీకి కార్యాలయ భవనం మం జూరు కావడంతో గురువారం అధికారులు భవన నిర్మాణం కోసం మార్కింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించగా ఎర్రగుంట తండావాసులు అడ్డుకున్నారు. మరోవైపు బెజ్జం చెరువు తండావాసులు ఎర్రకుంట తండాకు చెందిన కొందరు అడ్డుపడుతున్నారని గురువారం ఎంపీడీవో ప్రభాకర్ చారితో పాటు ఎస్సైకి వినతిపత్రాలు అందజేశారు. దీంతో సమస్య పరిష్కరించేందుకుగాను ఎర్రకుంట తండాకు చెందిన కొందరికి పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా ఎస్సై భార్గవ్‌గౌడ్ సమాచారం ఇచ్చారు. దీంతో ఎర్రకుంట తండావారు శుక్రవారం తరలివచ్చారు.

శ్రీ భాషిత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పల్లె గంగారెడ్డి

ఆర్మూర్ , ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం శ్రీబాషిత పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి హాజరయ్యారు. .కార్యక్రమలో పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

ముప్కాల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మప్కాల్, బాల్కొండ మండలాల్లోని బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెం దిన తలారి నరేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆ కుటుంబ సభ్యులను, ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లయ్య వారి తండ్రి భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

అన్న మరణ వార్త విని..

కుప్పకూలిన సోదరుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఉదయం ఒకరివి, సాయంత్రం మరొకరి అంత్యక్రియలు

వేల్పూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) తోడబుట్టిన అన్న కన్నుమూశాడనే వార్త విన్న తమ్ముడికి గుండెపోటు వచ్చి మృతి చెందిన ఘటన వేల్పూరు మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్థుల వివరాల ప్రక్యారం.. అంక్సాపూర్ గ్రామానికి చెందిన భార్గవ్ (57)అనే వ్యక్తి వృత్తిరీత్యా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం ఆకస్మాత్తుగా శ్యామ్ గుండెపోటుతో మరణించాడు. ఆ విషయాన్నీ శ్యామ్ సొంత గ్రామమైనా అంక్సాపూర్ కు నాగ్‌పూర్ నుంచి సమాచారం ఇచ్చారు. అంత్యక్రియలకు మృతదేహన్ని గ్రామానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం అంక్సాపూర్ లోనే నివాసం ఉంటున్న మృతుడు శ్యామ్ తమ్ముడు విజయ్ కుమార్‌కు తెలిసింది. అన్న మరణ వార్త విన్న తమ్ముడు విజయ్‌కు గుండెపోటు వచ్చింది. చికిత్స నిమిత్తం స్థానికులు అంబులెన్సులో నిజామాబాద్ జీజీహెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ విజయ్ మృతి చెందాడు. కుటుంబ కలహాల కారణంగా మృతుడు విజయ్ భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. గత కొద్దీ రోజులుగా ఒంటరిగా ఉంటున్న విజయ్ కు తన అన్న శ్యాం ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండి ఆదుకొన్నాడు. తనకు అండగా ఉండి ఆదుకొంటున్న పెద్ద దిక్కు, తన తోడబుట్టిన అన్న మరణించడాన్ని జీర్ణించుకోలేని తమ్ముడు విజయ్ కూడా తన అన్నతో కలిసి అనంత లోకాలకు వెళ్లాడు. ఇద్దరు అన్నదమ్ములు ఒకే రోజు మరణించడం తో గ్రామంలో విషాద ఛాయాలు అలుముకొన్నాయి. అన్న అంత్యక్రియలు మధ్యాహ్నం, తమ్ముని అంత్యక్రియలు సాయంత్రం నిర్వహించడం గ్రామస్థులను కలచివేసింది.

కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీని నెరవేర్చాలి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన తులం బంగారాం హామీని వెంటనే నెరవేర్చాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. బాల్కొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కొత్తగా మం జూరు కోసం దరఖాస్తు చేసుకున్న 157 కల్యాణలక్ష్మీ, షాదీముభాకర్ పత్రాలపై సంతకాలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మంజూరైనా లబ్ధిదారులందరికి తులం బంగారాం వర్తింపజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం



అన్నారంలో తలకిందులుగా ఎగురవేసిన జాతీయ పతాకం

బీర్కూర్/బాన్సువాడ రూరల్/నసురుల్లాబాద్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారంలో అంగన్వాడీ టీచర్ జాతీయ జెండాను తలకిందులుగా ఆవిష్కరించారు. అనంతరం జెండాను కిందకు దింపి సరిచేసి జెండాను ఆవిష్కరించారు.

● బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్, సంగోజీపేట్ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఎగురవేసిన జాతీయ జెండాలను కొన్నిగంటల్లోనే తీసి కార్యాలయం లోపల పెట్టారు.

● నసురుల్లాబాద్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సువర్ణ జాతీయ పథకాన్ని పై వరకు తీసుకెళ్లి, మళ్లీ కిందికి దించి, అనంతరం మళ్లీ జాతీయ జెండాను ఎగురవేశారు. జెండా పూర్తిగా పైకి వెళ్లకుండానే మధ్యలోనే జెండాను ఎగరవేశారు.

పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

రుద్రూరు,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా బ్యాంక్ ప్రతి సంవత్సరం అందజేసే డా.అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను శుక్రవారం రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థినిలకు కెనరా బ్యాంక్ సిబ్బందికి షిండే, సుధాకర్‌లు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోతరగతి టాపర్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

వేల్పూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్, పచ్చల నడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యంత మార్కులు సాధించిన విద్యార్థులకు దాతలు నగదు ప్రోత్సాహం అందజేశారు. ఆయా పాఠశాలలో పదోతరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ. 20 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.15వేలు, తృతీయ స్థానంలో మార్కులు సాధించిన రూ.10వేల చొప్పున ఆయా గ్రామాల దాతలు నగదు ప్రోత్సహం అందజేసి, విద్యార్థులను అభినందించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, దాతలు యల్లా రాజ్‌పాల్, పచ్చల నడ్కుడ సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి అనపల అనంతరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రుద్రూరు,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు మండల కేంద్రంలోని ఎరుకల గల్లి, బోయవాడలో ఇల్లు నీట మునిగాయి. శుక్రవారం మండల బ్లాక్ కఆంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

హిందూ వాహిని అధ్యక్షుడిగా బాలు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ వాహిని అధ్యక్షునిగా మందుల బాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో హిందూవాహని సమావేశం ఏర్పాటు చేసి సభ్యులందరు మందుల బాలును ఏకగ్రీవంగా ఎన్నుకుని పట్టు శాలువ, పూలమాలతో సన్మానించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కల్దుర్కి, బిక్‌నెల్లి గ్రామాలను సందర్శించిన అధికారులు

బోధన్/మోస్రాఆగస్టు15(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో బోధన్ మండలంలోని కల్దుర్కి, బిక్‌నెల్లి గ్రామాలను శుక్రవారం తహసీల్దార్ విఠల్, ఎంపీడీవో మధుకర్, రూరల్ సీఐ మచ్చేందర్ రెడ్డి సంబంధిత అధికారులు గ్రామాలలో పర్యటించారు. కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ గంగాధర్‌లున్నారు.

● మోస్రా : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో తహసీల్దార్ పర్యటించారు. లోతట్టు ప్రాంతాలను, పురాతనమైన ఇళ్లు కూలిపోయే దశలో ఉన్న ఇళ్లను, చెరువు కట్టలు, కాలువలను పరిశీలించామని, అదే విధంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసర నిమిత్తం మండల గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని మండల ప్రజలకు సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మోస్రా తహసీల్దార్ రాజశేఖర్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

గుడి నిర్మాణానికి ఎమ్మెల్సీ విరాళం

బోధన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగం గ్రామంలో మైసమ్మగుడి నిర్మాణానికి, విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు బోధన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు తోట శ్రీనివాస్, రైతు అధ్యక్షులు మాణిక్ వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ హన్మంతు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, మాజీ సొసైటీ చైర్మన్ అబ్బారెడ్డి, శంకర్, రాములు, బాలు, ఆలయ కమిటీ సభ్యులు సాయిలు, అబ్బులు, సతీష్, మహేందర్, సాయిలు, గంగాధర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎత్తొండలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కోటగిరి,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి ధనుంజయ్ ఆరు సైకిళ్లను అందజేశారు. మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని 1997లో పాఠశాలలో విద్యనభ్యసించిన ధనుంజయ్ తనవంతు సాయంగా ఆరుసైకిళ్లను అందజేశారు. అవసరమైతే మరికొంత మంది విద్యార్థులకు సహాయం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు సాయిలు, అజయ్, విజయ్, భీంరావు, నవీన్, సునీత, రాములమ్మ, సుమలత పాల్గొన్నారు.



గుంతలమయంగా రోడ్డు

గుంతలను పూడ్చరూ..

- గుంతల్లో నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బందుల్లో వాహనదారులు

బాన్సువాడటౌన్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి సరస్వతీ నగర్ వెళ్లే దారి గుంతలమయంగా మారింది. వర్షం కురిసినపుడల్లా ఈ గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. అంతేకాకుండా వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ గుంత లోతోగా మారి ప్రమాదకరంగా తయారైందని, వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు



సరస్వతీ నగర్ వెళ్లే దారిలో గుంతలో నిలిచిన వర్షపు నీరు

వాపోతున్నారు. అధికారులు గుంతలను పూడ్చాలని, సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు



గతంలో వేసిన ఇసుకబస్తాలు ధ్వంసమవుతున్న దృశ్యం

బుంగపై బెంగ

- ప్రమాదంలో సింగీతం రిజర్వాయర్
- ముందస్తుగా గేట్లు ఎత్తివేత

మహమ్మద్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగీతం రిజర్వాయర్ నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా చెప్పుకుంటారు. సింగీతం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండితే నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తారు. కానీ ప్రస్తుతం సింగీతం రిజర్వాయర్‌కు ఏర్పడిన బుంగతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని రిజర్వాయర్ పూర్తిగా నిండక ముందే అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 416.550 మీటర్లు కాగా ప్రస్తుతం 415.900 మీటర్ల వరకు నీటి నిల్వ ఉంది. సింగీతం రిజర్వాయర్‌కు కేవలం 300 క్యూసెక్కుల నీరు చేరడంతో మూడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. సింగీతం రిజర్వాయర్ పరిధిలోని నర్వ శివారులో రిజర్వాయర్‌కు బుంగ పడటంతో గతంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తాత్కాలికంగా మరమ్మతుల కోసం రూ.9 లక్షలు మంజూరు చేశారు. ఆరునెలల క్రితం రిజర్వాయర్ పూర్తిస్థాయిగా నిండటంతో నీరును దిగువకు వదిలి ఆ నిధులతో మొక్కుబడిగా ఇసుక బస్తాలను అడ్డుగా వేసి కాంట్రాక్టర్ చేతులు తులుపుకున్నాడు. అప్పటినుంచి ఇప్పటివరకు అధికారుల పర్యవేక్షణ లేక రిజర్వాయర్ అస్తవ్యస్తంగా మారింది. బుంగతో ఈ ప్రమాదం పొంచి ఉందని ఆయకట్టు రైతులు తెలిపారు. పూర్తిస్థాయి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు కూడా పంపించామని, ఇప్పటివరకు నిధులు మంజూరు కాకపోవడంతో వరద తాకిడికి పూర్తిగా ఆయకట్టుకు వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతాయనన్న ఉద్దేశ్యంతోనే ముందస్తుగా గేట్లు ఎత్తి జాగ్రత్తగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు.



రిజర్వాయర్ గేట్లను ఎత్తుతున్న అధికారులు

నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం

పునర్‌నిర్మాణం అయ్యేనా?

- నిలిచిన చేపపిల్లల ఉత్పత్తి
- జాడ లేని రాష్ట్ర స్థాయి పరిశీలకుల కమిటీ
- నీటి మూటలుగా పాలకుల వాగ్ధానాలు
- నేడు పట్టింపు లేక ఉత్పత్తి కేంద్రం అధోగతి

నిజాంసాగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం. నేడు ఆలనా పాలనా లేక కళాహీనంగా మారింది. ఈ ఉత్పత్తి కేంద్రంలో గత కొన్నేళ్లుగా లక్షల చేపపిల్లల ఉత్పత్తి నిలిచిపోయింది. పాలకులు ఇస్తున్న వాగ్దానాలు నీటి మూటలుగా ఉండిపోతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలోని అచ్చంపేట శివారులో 11 ఎకరాల స్థలంలో 1956లో అప్పటి ప్రభుత్వం చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. లక్షల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు 36 సిమెంటు నర్సరీలు, నాలుగు మట్టి కుంటలు నిర్మాణం చేపట్టారు. 1956 నుంచి 1985 సంవత్సరం వరకు ఈ ఉత్పత్తి కేంద్రం రాష్ట్ర రాజధానిలోని ప్రాముఖ్యత సంచరించుకుంది. లక్ష్యానికి మించి చేపపిల్లలను ఉత్పత్తి చేసి బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్, ఉమ్మిడి మెదక్ జిల్లా అయిన నారాయణఖేడ్



మరమ్మతులు లేకనిరుపయోగంగా చేపపిల్లల నర్సరీలు

నియోజకవర్గాలలోని చెరువులు కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తూ మత్స్యకారుల ఉద్ధరణ కోసం అప్పటి ప్రభుత్వాలు కృషి చేశాయి. క్రమంగా ఈ కేంద్రంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉత్పత్తి కేంద్రం కళాహీనంగా మారడమే కాకుండా కేంద్రంలోని 36 నర్సరీలతో పాటు మట్టి కుంటలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చేపపిల్లల ఉత్పత్తికి నోచుకోవటం లేదు.

నిధుల మంజూరుపై గోప్యత

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం నిర్వహణ కోసం ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేశారు అనేది పనిచేస్తున్న అధికారులు గోప్యంగా ఉంచడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో చెరువు, కుంటల నుంచి మత్స్యశాఖ అధికారులు లీజును వసూలు చేసి మత్స్యశాఖ ఖాతాలో జమచేస్తూ అత్యవసరాల మరమ్మతుల కోసం జమ ఉన్న డబ్బులను ఉన్నతాధికారుల సిఫారసులు కోరి ఖర్చు చేసేవారు. కానీ ఈ కేంద్రం ఆలనా పాలన లేకపోవడంతో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది నెలసరి జీతాలకే పరిమితమవుతున్నారు. తూతూ మంత్రంగా జిల్లా అధికార యంత్రాంగం నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చిరు చేప పిల్లలు ఉత్పత్తి చేయాలని తూతూ మంత్రంగా ఇదిగో నిధులు అంటున్నారు తప్ప కేంద్రంలోని నర్సరీలు మట్టి కుంటలు మరమ్మతులకు నోచుకోవటం లేదు.

నివేదికలు పంపుతున్నా..

నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర పునర్ నిర్మాణం చేసేందుకు ప్రభుత్వానికి అధికార యంత్రాంగం గత పదేళ్లుగా నివేదికలు పంపుతోంది. నిధుల జాడ లేకపోవడమే కాకుండా పాలకులు పట్టించుకునే పాపాన పోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారం కోల్పోయాక కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్‌నిర్మాణం అయ్యేనా అని మత్స్య కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యేను జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్ష పాలకవర్గం జుక్కల్ కలిసి నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునర్‌నిర్మాణం చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే జూలై చివరి వారంలో నిజాంసాగర్ చేపపిల్లలు రాష్ట్ర పరిశీలన కమిటీ సందర్శిస్తారని ఆయన హామీఇచ్చారు. అధికారులు సందర్శించాక చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్‌నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కానీ రాష్ట్రస్థాయి పరిశీలన కమిటీ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన లేకపోయారని మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్‌నిర్మాణమైతే ఇక్కడే లక్షల పిల్లలను ఉత్పత్తి చేసుకోవడానికి అనుకూలమని పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నిజాంసాగర్ చేపపిల్లలకు ఉత్పత్తి కేంద్రం రూపురేఖలు మారటం లేదు. ఇప్పటికైనా పాలకులు, మత్స్య సంపద కోసం ఉత్పత్తి కేంద్రాన్ని పునర్‌నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కళాహీనంగా మారిన చేపపిల్లల మట్టికుంటలు ఇవే..



చేపపిల్లలు ఉత్పత్తి కేంద్రం కార్యాలయం



వరలక్ష్మి పూజలు చేస్తున్న మహిళలు

పోచారం రామాలయంలో సామూహిక వరలక్ష్మి పూజలు

ఎడపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో గల రామాలయంలో శుక్రవారం దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సామూహిక వరలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వరలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పోచారం గ్రామంలోని రామాలయంలో వరలక్ష్మి పూజలు నిర్వహించి 50 మంది మహిళలుకు చీరలను బహూకరించినట్లు దానధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు వెంకట్, వెవక్ష్ దర్మా ట్రస్ట్ నరేష్, కీర్తన రాజు, మల్లి కార్జున్, సుధ, పోచారం గ్రామ కమిటీ అధ్యక్షులు అంజనీ కుమార్, సభ్యులు తదితరులు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: ఎస్సై

కోటగిరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కోటగిరి ఎస్సై సునీల్ సూచించారు. కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ మండపాలను ఏర్పాటు చేసేవారు అనుమతులు తీసుకోవాలని సూచించారు. డీజేలను ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట ఎస్సైగా తిరుపతి బాధ్యతల స్వీకరణ

నవీపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నవీపేట ఎస్సైగా సీహెచ్ తిరుపతి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నవీపేట ఎస్సైగా పనిచేసిన వినయ్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. వినయ్ సుమారు ఏడాది పాటు నవీపేట ఎస్సైగా విధులు నిర్వహించారు. తిరుపతి ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ నుంచి నవీపేటకు బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీ
విజేతలకు బహుమతులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానవ సంబంధాలు టెక్నాలజీ ప్రభావం అనే అంశంపై చౌట్‌పల్లిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఆంధ్రయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లుక్కగంగాధర్, కార్యదర్శి రేవతిగంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుర పట్టు హైలెస్సా..
పట్టు తప్పిందా గోవిందా!

- ప్రమాదకరంగా శర్బత్ కెనాల్‌పై ఉన్న కల్వర్టులు
- తృటిలో తప్పిన ప్రమాదం
- చాకచక్యంగా వ్యవహరించిన ట్రాఫిక్ పోలీసులు

బోధన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శర్బత్‌కెనాల్ చౌరస్తాలో ఒకవైపు పనులు కొనసాగుతుండగా.. మరోవైపు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో భారీ ఇనుప చువ్వలతో కూడిన వెళ్తున్న ఆటోట్రాలీ అనిల్ టాకీస్ రోడ్డుపై ఉన్న గుంతలోకి దిగబడింది. దీంతో వెనుక ఉన్న వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి వెంటనే ప్రమాదాన్ని పసిగట్టి గట్టిగా విజిల్స్ వేస్తూ వాహనాలను ఆపారు. ఇనుప చువ్వల అధికలోడ్‌తో దిగబడిన ఆటోట్రాలీని ఒక పట్టుపట్టి రోడ్డుకు అటు వైపుగా తరలించారు. దీంతో వెనుక ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ద్విచక్ర వాహనాలను మాత్రమే ఇటువైపుగా అనుమతించాలని ఫోర్ వీల్లర్స్‌ను అనుమతించవద్దని స్థానిక దుకాణదారులు, కాలనీవాసులు, ప్రజలు కోరుతున్నారు.



శర్బత్ కెనాల్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులు



కల్వర్టుపై దిగబడ్డ ఇనుప చువ్వల ట్రాలీని అటు వైపుగా తరలిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆరున్నర టీఎంసీలకు చేరిన నీటి సామర్థ్యం

నిజాంసాగర్‌లోకి భారీగా వరద

- సింగూరు నీటి విడుదలతో మంజీరా నది ఉరకలు
- నిజాంసాగర్, సింగూరులో పెరుగుతున్న నీటి నిల్వలు
- సింగూరుకు 17,689 క్యూసెక్కుల వరద రాక.. 10వేల 838 క్యూసెక్కుల నీటి విడుదల
- పెరుగుతున్న నీటి నిల్వలతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

నిజాంసాగర్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు వరద గేటు ఎత్తివేతతో వస్తున్న నీటితో పాటు మంజీరా వెంట నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఉభయ జిల్లాల రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. రెండురోజుల క్రితం నుంచి సింగూరు ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న విషయం విధితమే. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకల ద్వారా వరద నీరు నిజాంసాగర్‌లోనికి వస్తుండటంతో ప్రాజెక్టు నీటినిల్వలు క్రమేపీ పెరుగుతున్నాయి. సింగూ రు ప్రాజెక్టులోనికి ఏవో ప్రాంతం నుంచి 17,689 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఆ ప్రాజెక్టు అధికారులు దిగువకు 10838 ముప్పై ఎనిమిది క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి వదులుతున్నారు. సింగూరు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలకు గాను 22.022 టీఎంసీల సామర్థ్యానికి చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టు వరద గేటు ద్వారా 7,694 క్యూసెక్కులు జెన్కో ద్వారా 2511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం 17.802 టీఎంసీలకు 6.503 టీఎంసీల సామర్థ్యానికి చేరుకుంది. నిజాంసాగర్‌లోనికి మంజీరా ద్వారా భారీ వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఉభయ జిల్లాల రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. గురువారంరాత్రి కురిసిన భారీవర్షాలకు వాగు లు, వంకలతో పాటు నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యకమతవుతోంది.



సింగూరు నీటి విడుదలతో మంజీరా నదివెంట నిజాంసాగర్‌లోకి వస్తున్న నీరు



ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రాఘవేందర్

బాన్సువాడ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణ ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా నార్ల రాఘవేందర్ గుప్త ఎన్నికయ్యారు. శుక్రవారం సంఘ భవనంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకుని కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నార్ల రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా గుడుగుట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రుద్రంగి గంగాధర్ గుప్త, కోశాధికారిగా నరేశ్‌గుప్త, గౌరవ అధ్యక్షుడిగా నాగులగామ శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకుల చేరిక

మహమ్మద్‌నగర్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఇఫ్తాకర్‌తో పాటుగా పలువురు శుక్రవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్లఓ చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు సిద్ధం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షులు మల్లయ్యగారి ఆకాష్, నాయకులు కలిక్, గంగి రమేష్, కోరమండల్, తోట రాజు, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఊరేగింపు

దోమకొండ(బీబీపేట), ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలకేంద్రంలో శ్రావణమాస మూడవ శుక్రవారం సందర్భంగా పెనుగొండ సంస్థానం నుండి అంతర్జాతీయ వాసవీ క్లబ్ ద్వారా వచ్చిన అమ్మవారి చీర, పసుపు కుంకుమలను 11 రకాల స్వీట్లతో దంపతుల యుక్తంగా వాసవీక్లబ్ నుంచి శ్రీ నగరేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించబడిన శ్రీ మాత కన్యాక పరమేశ్వరీ ఆలయానికి ఊరేగింపుగా రావడం జరిగింది. తదుపరి అమ్మవారికి చీర సమర్పించి భజనలు చేసి అల్పాహారం గావించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



గాంధారిలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

గాంధారి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు పొడిగించినందుకు గానూ గాంధారి మండలకేంద్రంలోని విండో కార్యాలయం వద్ద ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్ రావు చిత్రపటానికి సింగిల్ విండో పాలకవర్గం సిబ్బంది, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్ శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ మాట్లాడుతూ విండో పాలక వర్గాలను మరో ఆరు నెలలు పొడగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు సేవ చేయడానికి మరో ఆరు నెలలు గడువు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో విండో పాలకవర్గం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వరనగర్ గ్రామాభివృద్ధి నూతన కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామాభివృద్ధి కమిటీని గ్రామస్థులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దండు అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బియ్యం రాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల సతీష్, సహాయ కార్యదర్శిగా బోనాల హరీంద్ర, కోశాధికారిగా ఎలుగు నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నర్సింలు, నాగులు, బి.శ్రీనివాస్, బలరాం, భూమలింగం, దుర్గాబాబు, లింగం, ఎలుగు సిద్ధూ, గుడాల అరుణ్, శ్రీనివాస్, చంద్రయ్య, ప్రభాకర్, ప్రసాద్, భూమయ్య, కృష్ణమూర్తి, పవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జంగంపల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గంప గోవర్ధన్

భిక్కనూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన చెన్నప్పగారి కిష్టారెడ్డి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విండో ఛైర్మన్ సిద్ధరాములు, బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్, బాల్‌చంద్రం, శివలింగం, నవీన్, సంతోష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



ఎస్పీ కార్యాలయంలో..



కాంగ్రెస్ కార్యాలయం వద్ద..



జెండా ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

అంబరాన్నంటిన స్వాతంత్ర్య సంబురాలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సంబురాలు శుక్రవారం అంబరాన్నంటాయి. రాజకీయ పార్టీలు, వాణిజ్య, వ్యాపార, కుల, ప్రజా, సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఇంటిపై జాతీయ జెండాను రెపరెపలాడించారు. కలెక్టరేట్‌లో, జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కామారెడ్డి బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌తో కలిసి జెండాను ఎగురవేశారు. జిల్లా కేంద్రంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు జెండా ఎగురవేశారు.టీఎన్‌జీవోస్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్డీవో, డిఎస్పీ, పట్టణపోలీస్‌స్టేషన్, కోర్టు ఎదుట న్యాయమూర్తులు జాతీయజెండాను ఎగురవేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంలు జాతీయ జెండాను ఎగరవేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పట్టణంలోని ఆర్‌కే, ఎస్ఆర్కే, సాందీపని, శ్రీసాందీపని, ఆర్యభట్ట, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలతో పాటు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు,కార్యకర్తలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దశరథ్, ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో లక్ష్మీకాంత్‌రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అరుణ్‌కుమార్, గురుకుల పాఠశాలలో ప్రత్యేక అధికారిణి సునీత, వివిధ పార్టీల కార్యాలయాలలో వాటి బాధ్యులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థులు దేశ నాయకుల వేషధారణతో గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు.

జుక్కల్: జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో తోట లక్ష్మీకాంతరావు జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నవీన్ చంద్ర జాతీయ పథకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. జుక్కల్ మండలం పెద్ద ఏడి గ్రామంలో మార్కులు సాధించిన బాలికలకు నగదు రూపంలో డబ్బులు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి తిరుపతయ్య, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం గంగారం, సొసైటీ కార్యదర్శి బాబురావు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అశోక స్థూపాన్ని ఆవిష్కరించారు. అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో , ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో అధికారులు, ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాలు, కులసంఘాల నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్, వ్యవసాశాఖ, అగ్నిమాపకశాఖ, అటవీశాఖ తదితర కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

బీర్కూర్: బీర్కూర్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సాయి భుజంగ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజశేఖర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మహబూబ్, ఐకేపీ కార్యాలయంలో అధ్యక్షురాలు సుభద్ర, గ్రామ సమీపంలో కార్యదర్శి గంగారాం, తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మద్నూర్: మండలంలోని పెద్ద ఎక్లారా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, పిఈటి మౌనిక, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో తెల్లవారు జాము నుంచి విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వేషధారణతో ప్రభాత భేరీ నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ ముజీబ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో రాణి ఎంపీడీవో, ఎస్‌టిఓ కార్యాలయంలో శివరాజ్ ఎస్‌టిఓ, సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, ఇందిరా మహిళ శక్తి కార్యాలయంలో ఏపిఎం జగదీష్, డోంగ్లి తహ సిల్దార్ కార్యాలయంలో ప్రవీణ్ కుమార్ తహసిల్దార్, పంచాయతీ రాజ్,ఆర్ అండ్‌బి కార్యాలయాలలో అధికారులు బీజేపీ కార్యాల యంలో మండల అధ్యక్షులు తుకారాం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు ధరస్ సాయిలు, బిఆర్ఎస్ కార్యాలయంలో అధ్యక్షులు బస్పిపటేల్, మార్కెట్ కమి టీలో చైర్ పర్సన్ సౌజన్య రమేష్, రైతు వేదికలో వ్యవ సాయ అధికారి రాజు, గ్రామ పంచాయితీలో కార్యదర్శి సందీప్, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్ ఆనంద్ జాదవ్, జాతీయ పతాకాన్ని ఎగురవేసి నేటి మన స్వాతంత్ర సంబరాలకు అమరవీరులైన త్యాగధనులకు నివాళులు అర్పించారు.

నసురుల్లాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ సువర్ణ, మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాఘవేంద్ర, ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ మాధవరావు, రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారిని భవాని, ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి చందర్, ఐకేపీ కార్యాలయావరణలో ఏపీఎం పద్మ జాతీయ జెండాను ఎగరవేశారు. చిన్నారుల వేషధార ణలను చూపరులను ఆకట్టుకున్నాయి. ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పతాకాన్ని ప్రిన్సిపాల్ గంగాధర్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రభాకర్ చారి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై భార్గవ్ గౌడ్, ఎం ఈవో కార్యాలయం వద్ద మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో సాయి కిరణ్‌లు జాతీయ పథకాలను ఆవిష్కరించారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద ప్రభు త్వ విత్తన క్షేత్రంలో ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న ఇంద్రసేన్‌కు జిల్లా ఉన్నతాధికారులు నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన మం డల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిన ఈ అధికారి వేడుకలకు హాజరు కాలేదు. మాల్తుమ్మెద విత్తన క్షేత్రం కార్యాలయం వద్ద ఏడీఏగా ఈ అధికారే జాతీయ పథకాన్ని ఆవిష్కరించాల్సి ఉండగా ఈ అధికారి శుక్రవారం కార్యాలయానికి రాకపోవడంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కింది స్థాయి అధికారిని అయిన ఏవో అచరిత విత్తన క్షేత్రం కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ జెండా పండుగకు కార్యాలయ క్రింది స్థాయి అధికారులు ఏఈవోలు శ్యాంసుందర్ రెడ్డి, నాగరాజు, రికార్డు అసిస్టెంట్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గైర్హాజర్ కావడం పట్ల అధికారి తీరుపై పలువురు విమర్శిస్తున్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జెండా వందనం చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ఆఫీసుల ముందు కూడా జెండాను ఎగురవేశారు. ఇందులో మండల అధికారులు తహసీల్దార్ శ్వేత, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపిఓ సబిత రెడ్డి, ఎస్సై మురళి, ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా పార్టీల అధ్యక్షులు, గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

భిక్కనూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, ఆయాపార్టీలు, ఆయా యూనియన్‌ల ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని అధికారులు, నాయకులు, ఆయాసంఘాల, ఆయా పార్టీల అధ్యక్షులు ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వేషాధారణలు, మార్చ్ ఫస్ట్ ఆకట్టుకున్నాయి. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుక్షేత్రంలో జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్ రెడ్డి జెండా ఎగురవేసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని రిటైర్డ్ జవాన్లను, రైతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, వైద్యాధికారిణీ యేమిమా, ఎస్సై ఆంజనేయులు, ఏపీఎం సాయిలు, ఆయా కార్యాలయాల అధికారులు, మాజీసర్పంచ్‌లు, మాజీఎంపీటీసీలు, మహిళ సంఘాల ప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమకొండ(బీబీపేట): దోమకొండ, బీబీపేట మండలాల్లో ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్మిక సంఘాల నేతలు త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గాంధారి: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో రేణుకా చౌహన్, విండో కార్యాలయంలో చైర్మన్ సాయికుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ పరమేష్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో రాజలింగం, పోలీసుస్టేషన్‌లో ఎస్సై ఆంజనేయులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో, ఆయాపార్టీల కార్యాలయాల వద్ద ఉపాధ్యాయులు, నాయకులు జెండా ఎగురవేశారు. అనంతరం ఉన్నత పాఠశాలలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేవారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మధుసూదన్ రాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన రోజాకు బంగారు పతకం, ద్వితీయ స్థానంలో నిలిచిన జి.కీర్తనకు, తృతీయ స్థానంలో నిలిచిన స్వాతి, చతుర్థ స్థానంలో నిలిచిన మనుశ్రీకి రజత పథకాలను, గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనా డి.శృతికి రజత పథకం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అమర్‌సింగ్, వర్తక సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి జెండా ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఐకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం ప్రసాద్, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజారెడ్డి, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో ప్రజాపతి, సింగిల్ విండో కార్యాలయం వద్ద చైర్మన్ కమలాకర్ రావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో ఎస్సై అనీల్‌కుమార్, ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, పాఠశాలల వద్ద ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలు, తదితర ప్రదేశాల్లో కార్మిక సంఘాల ప్రతినిధులు, విండో చైర్మన్లు, ఆయాపార్టీల మండల అధ్యక్షులు, నాయకులు త్రివర్ణ పతకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాన్సువాడలో..



సబ్ కలెక్టర్ కార్యాలయంలో..



పెద్ద ఎక్లారాలో..



ఎస్ఆర్ఎన్‌కే కళాశాలలో..

బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు అంజయ్య శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ప్రేరణ కలిగిందని, ప్రజల కోసం పనిచేస్తున్న నాయకత్వం కాంగ్రెస్ పార్టీలో ఉందని, కాంగ్రెస్ పార్టీలో అన్నివర్గాల వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నారనే నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సాయిబాబా, సంజీవులు, గ్రామంలోని కార్యకర్తలు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సాయిలు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నిజాంసాగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర వేడుకల్లో భాగంగా నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన తప్పెట్ల సాయిలు హైదరాబాద్‌లో పెయింటర్ కాంట్రాక్టుగా పనిచేస్తూ గ్రామ పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. శుక్రవారం స్వాతంత్ర వేడుకల భాగంగా సాయిలు గ్రామపంచాయతీ కార్యదర్శి గైని తుకారంను, పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ మంద బలరాం తదితరులు ఉన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపికైనా విద్యార్థినికి సన్మానం

మహమ్మద్‌నగర్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన వైష్ణవీ రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపికైనందుకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బాగంగా శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకన్న మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, గ్రామానికి రాష్ట్రస్థాయిలో మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పండరి, సాయిలు, పోచయ్య, విద్యారచన, సరస్వతి, లక్ష్మీప్రసన్న, కారోబర్ జంగం ప్రభాకర్, గ్రామస్థులు గొట్టం నర్సింలు, భూమాగౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

108 వాహనంలో మహిళ ప్రసవం



గాంధారి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన రవళికి పురిటీనొప్పులు ఎక్కువ రావడంతో భర్త శ్రీనివాస్ శుక్రవారం 108 అంబులెన్స్‌కు సామాచరం అందించారు. వెంటనే చేరుకున్న 108 అంబులెన్స్ మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మేడిపల్లి వద్ద నొప్పులు ఎక్కువ రావడంతో పాటు బిడ్డ బొడ్డు తడ్డు మెడ చుట్టూ ఉంటడం చూసి వైద్యుడి సలహాతో 108 సిబ్బంది రమేష్, నరేష్ ప్రసవం చేశారు. అనంతరం తల్లి, బిడ్డను 108 వాహనంలో చికిత్స నిమిత్తం బాన్సువాడకు తరలించారు. ఈ మేరకు 108 సిబ్బంది మాట్లాడుతూ తల్లి,బిడ్డ క్షేమంగా ఉందన్నారు. అనంతరం రవళి భర్త మాట్లాడుతూ రవళికి ఇది రెండవ కాన్పు అని సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి విరాళం అందజేత

దోమకొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో గల మల్లిఖార్జున్ స్వామి దేవాలయ అభివృద్ధికి శుక్రవారం ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్తగారి సాయాగౌడ్ కుమారులు శిరీష్‌గౌడ్, రాహుల్‌గౌడ్ రూ.10,116లను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి జ్ఞాపకార్థం ఆలయానికి విరాళం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

